# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయాలని ఏ ప్రపంచ నాయకత్వం భారత్‌ను అడగలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లోని నౌకాశ్రయాలను కలుపుతూ పారిశ్రామిక-లాజిస్టిక్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.**

**3.** **భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగాన్ని ఈ రోజు నిర్వహించనున్నారు.**

**5.** **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**

==========================

ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయాలని ఏ ప్రపంచ నాయకత్వం భారత్‌ను అడగలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. లోక్ సభలో ఆపరేషన్ సిందూర్ పై నిన్న జరిగిన ప్రత్యేక చర్చలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ లో ఉన్న ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసిందని అన్నారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్తాన్ కు భారతదేశం తగిన సమాధానం ఇచ్చిందని తెలిపారు. సాంకేతిక ఆధారిత యుద్ధ యుగంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని ప్రధానమంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 30 సెకెన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు, రాష్ట్రాభివృద్ధిలో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం కోసం సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు వివిధ సంస్థలు-సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తారు. అలాగే సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలోని కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం నౌకాశ్రయాలను కలుపుతూ పారిశ్రామిక–లాజిస్టిక్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సింగపూర్‌లో మూడో రోజు పర్యటనలో భాగంగా అక్కడి జురాంగ్ పెట్రో కెమికల్ దీవిని ముఖ్యమంత్రి, మంత్రుల బృందం గత సాయంత్రం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పోర్టుల అనుసంధానంతో పాటు, పోర్టులకు సమీపాన ప్రపంచశ్రేణి చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటు కానుందని చెప్పారు. పెట్రోకెమికల్ కేంద్రంలో ముడి చమురు శుద్ధి ప్రక్రియతో పాటు పాలిమర్లు, ఇంధనాల గురించి సింగపూర్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

--------------------------

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను నగరం వెలుపలకు తరలించాలని ఆదేశించారు. భూగర్భ మురుగు నీటి వ్యవస్థ , భూగర్భ విద్యుత్తు కేబుల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

--------------------------

ఏనుగుల సంచారంపై ఫోన్ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగు గుంపుల సంచారంపై గుంటూరు జిల్లా మంగళగిరి నుండి శ్రవణ మాధ్యమ విధానంలో ఉప ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల గ్రామస్థులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అటవీ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను చేపట్టాలని ఆదేశించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా జంతులూరు వద్ద నిర్మించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి దశ శాశ్వత భవనాలను... కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఢిల్లీ నుంచి నిన్న దృశ్య మాధ్యమం విధానంలో ప్రారంభించారు. రాష్ట్ర విభజన అనంతరం 492 ఎకరాల్లో ఈ సంస్థను ఏర్పాటు చేయగా.. ఇందులో భాగంగా మొదటి విడతగా 350 కోట్ల రూపాయలతో రెండు విద్యా భవనాలు, మూడు వసతిగృహాలు, అంతర్గత రహదారులతో సహా ఇతర సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ షీలా రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ 27 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం –షార్ నుంచి జీఎస్ ఎల్వీ–ఎఫ్16 రాకెట్ ప్రయోగాన్ని ఈ రోజు నిర్వహించనున్నారు. నాసా–ఇస్రో సంయుక్తంగా రూపొందించిన

'నాసా–ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్' –నిసార్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ఈరోజు సాయంత్రం పంపనున్నారు. ఈ ప్రయోగానికి నిన్న మధ్నాహ్నం 2 గంటల 10 నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రారంభించారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ సాయంత్రం 5 గంటల 40 నిమిషాలకు ప్రయోగిస్తామని ఇస్రో అధికారులు తెలిపారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే అంచనా వేయడానికి ఈ ఉపగ్రహం దోహదపడుతుందని చెప్పారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 29 వేల 796 రేషన్ దుకాణాల్లో ప్రతినెలా 1 నుంచి 15 వరకు రేషన్ సరఫరా జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 9లక్షల మందికిపైగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 35 సెకన్లు

-------------------------

తెలంగాణ వ్యాప్తంగా 84 శాతం మందికి సన్న బియ్యం అందిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి కొత్త రేషన్ కార్డులను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను జారీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో నూతనంగా ఏడు లక్షల 90 వేల రేషన్ కార్డులు మంజూరు చేశామని మంత్రి వివరించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సుస్థిర పట్టణాభివృద్ది సాధించేందుకు సింగపూర్ విధానాలను అధ్యయనం చేస్తున్నామని పట్టాణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సింగపూర్‌లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ బృందంపుంగోల్ పాయింట్ కేవ్ టౌన్ షిప్‌తో పాటు అక్కడి పలు ప్రాంతాలను సందర్శించింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిఫ్ అభివృద్ధికి, వాతావరణ అనుగుణమైన ఇళ్ల నిర్మాణాలు, నీటి నిర్వహణ వ్యవస్థకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పడమటి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్ నారాయణ తెలియజేశారు.

మరోవైపు తెలంగాణలోనూ వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

====================